


అత్యాశే చేటు

- సులభ రీతిలో డబ్బు సంపాదనకు కక్కుర్తి
- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్న అమాయకులు
- లక్షల రూపాయలు కోల్పోతున్న వైనం
- ఇటీవల కమిషనరేట్‌లో పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఆరు నెలల్లో 126 కేసులు నమోదు
- రూ.9కోట్లకు పైగా కాజేసిన మోసగాళ్లు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 27: కష్టపడకుండా, సులువుగా పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించాలనే ఆత్యాశతో పలువురు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపోతున్నారు. అత్యాశపరులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల గాలం వేస్తూ లక్షల్లో కాజేస్తున్నారు. వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. రోజుకో కొత్తరకం మోసంతో అత్యాశపరులను మోసం చేస్తున్న సంఘటనలు ప్రస్తుతం విరివిగా సాగుతున్నాయి. దేశ వ్యాప్తంగా మోసాల పరంపర కొనసాగుతుండగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాలకు బలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. సైబర్ మోసాలను అరికట్టేందుకు రాష్ట్ర పోలీసు శాఖ సైబర్ పోలీస్ స్టేషన్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినప్పటికీ నేరాలను కట్టడి చేయలేని స్థాయిలో మోసాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిరంతర సమీక్షలు జరుపుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. సైబర్ పోలీస్‌స్టేషన్‌కు విరివిగా ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు ఇస్తున్న బాధితుల్లో ఎక్కువమంది రూ.లక్షల్లో మోసపోతున్నవారే ఉన్నారు. వారిలో చిరువ్యాపారుల నుంచి ఐటీ ఉద్యోగుల వరకు ఉంటున్నారు.

మోసాల్లో ప్రధానంగా..

సైబర్ నేరగాళ్ల పలు రకాల మోసాలతో లక్షలు కాజేస్తున్నారు. టెక్నాలజీని వాడుకుంటూ రోజుకో కొత్తరకం మోసాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశచూపి లక్షలు కాజేస్తున్నారు. కొందరు ఫేక్ వెబ్‌సైట్ సృష్టించి పలు ఫోన్‌నంబర్లకు లింక్‌లు పంపుతారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు సంపాదించవచ్చని ఆశ చూపుతారు. లింక్ లాగిన్ అయ్యాక కొంత మొత్తం జమ చేయాలని మెసేజ్ వస్తుంది. ఇందుల్లో నేరగాళ్లకు సంబంధించిన సభ్యులుండి.. వారిలో ఒకరికి రెట్టింపు డబ్బులు వచ్చినట్లు చూపిస్తారు. అది చూసిన వారు డబ్బులు పంపుతారు. లాగేకాడికి లాగాక వెబ్‌సైట్‌ను తీసేస్తారు. అలాగే మరికొందరు ధని లోన్, ఇండియా బుల్స్ లోన్స్ పేరిట ఫేస్‌బుక్‌లో అడ్వర్టైజ్‌మెంట్ ఇస్తారు. ఇది చూసిన వారు లోన్ ప్రయత్నించగానే ప్రాసెసింగ్ ఫీజు చెల్లించమంటారు. డబ్బులు చెల్లించాక ఫేక్ అకౌంట్ క్లోస్ చేస్తారు. రూ.5లక్షల లోన్ కోసం రూ.3లక్షల వరకు చెల్లించిన బాధితులున్నారు. మరో మోసంలో ఫోన్ నంబర్లకు వీడియో కాల్ వస్తుంది. కాల్ లిఫ్ట్ చేయగానే న్యూడ్‌గా ఒక అమ్మాయి ఫోటో కనిపిస్తుంది. కాల్ కట్ చేసి అమ్మాయి ఫొటో ట్యాగ్ చేసి గ్రూపుల్లో పెడుతామని బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు గుంజుతారు. ఇదేకాక సిమ్ స్వాపింగ్ మోసం ఒక పద్ధతి. మన సిమ్ నేరాగాళ్ల వద్ద యాక్టివేట్ అవుతుంది. ఓటీపీ పంపుతారు. ఓపెన్ చేయగానే ఫోన్ నంబర్ ద్వారా అకౌంట్ నంబర్ తెలుసుకుని ఖాతాలోని డబ్బులు కాజేస్తారు. ఇంకోరకరంలో వాట్సాప్‌కు ఏపీకే ఫైల్ వస్తుంది. క్లిక్ చేయగానే మన నంబర్ హ్యాక్ అవుతుంది. హ్యాక్ అయిన నంబర్‌కు సంబంధించిన వ్యక్తి బ్యాంక్ ఖాతా, అందులో ఉన్న డబ్బుల వివరాలు తెలుస్తుంది. మొత్తం కాజేస్తారు.

ఆరు మాసాల్లో 126 కేసులు

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 2వ తేదీ ఏప్రిల్ 2024న సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ కమిషనరేట్ ఆవరణలో ప్రారంభమైంది. బాధితుల ఫిర్యాదు కోసం 1930 నంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభమైన ఆరు మాసాల్లో కమిషనరేట్ పరిధిలో 126 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో రూ.9కోట్ల 73లక్షలు సైబర్ నేరగాళ్ల కాజేశారు. పోలీసులు ఇప్పటి వరకు 17మంది నేరగాళ్లను అరెస్టు రూ.9లక్షల 74వేలు బాధితులకు అందించారు. పలు కేసుల్లో నేరస్తులను పట్టుకుని విచారిస్తున్నారు. చాలానేరాల్లో ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించినవే. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో విరివిగా సైబర్ నేరాల ఫిర్యాదులు అందుతున్నాయి.

నేరాల్లో కొన్ని...

- హనుమకొండకు చెందిన ఐటీ ఉద్యోగి జూలై మాసంలో రూ.85లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసపోయాడు.
- పర్వతగిరికి చెందిన ప్రైవేటు ఉద్యోగి రూ.71లక్షల 58వేలు జూలై మాసంలో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసపోయి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.
- హనుమకొండ సుబేదారి ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగి ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ.6లక్షల 6వేలు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు.
- జనగామకు చెందిన ప్రైవేటు ఉద్యోగి మే మాసంలో లోన్ వస్తుందనే ఆశతో రూ.20లక్షలు మోసపోయాడు.
- కాజీపేటకు చెందిన ప్రైవేటు ఉద్యోగి జూలైలో సిమ్ స్వాపింగ్ మోసానికి గురై రూ.8లక్షల 9వేలు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- జనగామకు చెందిని ప్రభుత్వ ఉద్యోగి ఏపీకే ఫైల్ ఓపెన్ చేసి తన ఖాతాలోని రూ.11లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ నేరం ఆగస్టులో జరుగగా బాధితుడు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



కె.విజయ్‌కుమార్, ఏసీపీ, సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి. విద్యాసంస్థల్లో, పబ్లిక్ గ్యాదరింగ్ ప్రదేశాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేరం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు గంటలోపు (గోల్డన్ అవర్) కాల్ చేయడం శ్రేయస్కరం. గంటలోపు కాల్‌చేస్తే సైబర్ నేరస్తుడు బాధితుల బ్యాంక్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకోవడం నిలిపివేసే అవకాశం ఉంటుంది. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల కట్టడి చర్యలు తీసుకుంటున్నాం. ఫిర్యాదులు అందిన వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. పలు కేసులను ఛేదించగలిగాం.



మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్

జిల్లాకు పర్యాటక అవార్డు

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు27: రాష్ట్రంలో రెండో స్థానంలో జిల్లా నిలిచినందుకు పర్యాటక అవార్డును శుక్రవారం కలెక్టర్ సత్యశారద అందుకున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డును కలెక్టర్ అందుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరంగల్ జిల్లాలో యువ టూరిజం క్లబ్‌ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో రాష్ట్రంలోనే ద్వితీయస్థానం సాధించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిరాదరణకు గురైన 14 ఆలయాలను గుర్తించి వాటి పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ సర్పంచులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 27: అప్పులు చేసి మరీ గ్రామాలను అభివృద్ధి చేస్తే ఇప్పటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల మాజీ సర్పంచులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు ఆకుల శ్రీనివాస్, విద్యాసాగర్‌లు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలో గ్రామాల్లో సీసీ రోడ్లు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, రైతు వేదికలు, మిషన్ భగీరథ పనుల కోసం ఆస్తులు అమ్ముకొని అభివృద్ధి చేశామన్నారు. బిల్లులు రాక పోవడంతో ఆత్మహత్యలే శరణ్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు కావస్తున్నా నేటికి మాజీ ప్రజాప్రతినిధులు పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సీఎం, సంబంధిత మంత్రి స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేసి మాజీ సర్పంచులను ఆదుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ధర్నా కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మహేందర్, తిరుపతి రెడ్డి, ఉమేశ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, చంద్రమౌళి, కిశోర్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్

గీసుగొండ, సెప్టెంబరు27: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగదేవిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్య శారద లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపూజీ సేవలను కొనియాడారు. అనంతరం పర్యాటక దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ పాకాలలో ఉండే ఆకుపచ్చ పావురాలు ప్రపంచంలో ఎక్కడ కనబడవన్నారు. వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ జోన్‌గా విస్తరించి పాకాల ఏకో టూరిజానికి మంచి నిలయంగా మారిందన్నారు. జిల్లాలో 41 పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, పర్యాటకశాఖ అధికారి శివాజీ, జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ రాజమౌళి, ఎంఈవో సాంబయ్య, హెచ్‌ఎం రజాక్, అధికారులు పాల్గొన్నారు.



కాకతీయుల కట్టడాలను పరిరక్షించాలి

- వారి గొప్పదనాన్ని తెలుసుకోవాలి
- ఎంపీ నిధులతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఎంపీ కడియం కావ్య
- కోటలో ఘనంగా వేడుకలు



7

మధ్యకోటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, పక్కన కలెక్టర్



ఉత్కర్ష అదుర్స్

కాకతీయ మెడికల్ కాలేజీ ఉత్సవం ఉత్కర్ష-24 శుక్రవారం ముగిసింది. చివరిరోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వైద్యవిద్యార్థులు ప్రదర్శనలు అందరినీ అలరించాయి. అనంత రం బహుమతి ప్రదానం నిర్వహించారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏఎన్‌ఆర్ లక్ష్మీ, డాక్టర్ రమేశ్‌రావు, ఫ్యాకల్టీ, అలుమినీ డాక్టర్లు పాల్గొని విద్యార్థులు ప్రోత్సహించారు.

-వరంగల్ మెడికల్

'మేడిగడ్డ' నిర్మాణ సంస్థకు గుబులు

- బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దుతో కలవరం
- తొలుత మరమ్మతులను నిరాకరించిన ఎల్అండ్‌టీ
- రూ.500 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన
- ఆతర్వాత రూ.155 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు

7లో..

తొండి ఆట!

ఎస్‌జీఎఫ్‌ఐ గేమ్స్‌లో ఇదో ప్రహసనం

- స్పోర్ట్స్ ఫీజు పేరుతో రూ.లక్షల్లో వసూలు
- రెండేళ్లుగా క్రీడలు నిర్వహించని ఎస్‌జీఎఫ్ఐ
- ఆడించకుండానే విద్యార్థుల ఎంపిక
- నిధులు గోల్‌మాల్ చేస్తున్న పరీక్షల బోర్డు?
- లెక్కాపత్రం లేకుండా ఖర్చులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27: ఆటలు ఆడించకుండానే విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. దీంతో ఆటల్లో ప్రతిభావంతులైన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతీఏడు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మండల, జోనల్, జిల్లా స్థాయి టోర్న మెంట్స్ నిర్వహిస్తారు. అయితే వరంగల్ జిల్లాలో రెండేళ్లుగా ఆటలు ఆడించకుండానే పాఠశాలకు ఇద్దరు విద్యార్థుల చొప్పున ఎంపికలు చేస్తున్నారు. దీంతో ప్రతిభావంతులైన క్రీడాకారులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10 తరగతి విద్యార్థుల నుంచి ప్రతీ సంవత్సరం పరీక్ష ఫీజులతోపాటు స్పోర్ట్స్ ఫీజు పేరిట జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు లక్షల రూపాయలను జిల్లా వ్యాప్తంగా వసూలు చేస్తోంది. గత రెండేళ్లుగా ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ నిర్వహించడం లేదు. అయినా నిధులు మాత్రం గేమ్స్ కోసం ఖర్చు చేసినట్లు లెక్కలు చూపినట్లు పరీక్షల బోర్డు తెలుస్తోంది. ఈ ఏడాది సైతంఇదే పద్ధతి కొనసాగించేందుకు ప్రణాళికలు రూపొందించి నిధులు నొక్కేందుకు పన్నాగాలు పన్నుతున్నట్లు సమాచారం.

ప్రతిభావంతులైన క్రీడాకారులకు అన్యాయం

ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది మండల స్థాయి, జోనల్ స్థాయి, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగానే విద్యార్థుల నుంచి స్పోర్ట్స్ ఫీజు వసూలు చేస్తున్నారు. అందుకు భిన్నంగా జోనల్, జిల్లా స్థాయిలో టోర్నమెంట్స్ నిర్వహించి పారదర్శకంగా క్రీడాకారులను ఎంపిక చేయాల్సిన ఎస్‌జీఎఫ్ఐ ప్రతినిధులు ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరిని మాత్రమే ఎంపిక చేస్తున్నారు. టోర్నమెంట్లు నిర్వహించకుండానే పాఠశాలల వారీగా విద్యార్థులను ఎంపిక చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కొంత మంది వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నేతల ఆధిపత్య ధోరణితో ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ సరైన పద్ధతిలో నిర్వహించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గేమ్స్‌పై అవగాహన శూన్యం

ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ నిర్వహణ తీరుపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మండిపడుతున్నాయి. ఆటలు ఎప్పుడు నిర్వహిస్తున్నారో కనీసం సమాచారం సైతం ఇవ్వడం లేదని వాపోతున్నారు. శని, సోమ వారాల్లో ఆటల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నా ఇప్పటివరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వారు చెబుతున్నారు. అయితే గేమ్స్ లేకుండా పాఠశాలకు ఇద్దరు చొప్పున పంపిస్తే ఎంపిక చేస్తామని నిర్వాహకులు చెబుతున్నట్లు తెలిసింది.

గేమ్స్ పేరుతో స్కూల్‌కు పీడీల డుమ్మా

ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ నిర్వహణ పేరుతో వరంగల్, ఖిలావరంగల్ మండలాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న 19మంది పీడీలు పాఠశాలలకు ఎగనామం పెడుతున్నట్లు సమాచారం. నిర్వహణ, ఏర్పాట్ల పేరుతో గత సోమవారం నుంచి పాఠశాలలకు హాజరు కావడం లేదని, వంతుల వారీగా నిర్వహణ ఏర్పాట్లలో పాల్గొనాల్సిన పీడీలు మూకుమ్మడిగా పాఠశాలలకు ఎగనామం పెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే నిర్వహణ స్థలమైన మామునూరు జడ్పీహెచ్‌ఎస్ గ్రౌండ్‌లో మాత్రం ఐదారుగురు పీడీలు మాత్రమే కనబడుతూ మిగతా వారు ఎక్కడికి వెళుతున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

లక్షల్లో ఫీజుల వసూలు

ప్రతీ సంవత్సరం ఉమ్మడి పరీక్షల బోర్డు ఆధ్వర్యంలో పరీక్ష ఫీజు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారు. వీటితోపాటు స్పోర్ట్స్ ఫీజు పేరిట లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. అయితే వీటికి లెక్కా పత్రం లేకుండా ఖర్చులు పెడుతున్నట్లు తెలుస్తోంది. రెండు, మూడేళ్లుగా ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ నిర్వహించడమే లేదు. అయినా లక్షల రూపాయల నిధులు మాత్రం ఖర్చు అయినట్లు లెక్కలు రాస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వరంగల్ జిల్లాలో కరోనా సమయంలోనూ విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజుతో పాటు స్పోర్ట్స్ ఫీజును వసూలు చేశారు. వాటికి లెక్కలు చూపించకుండా నొక్కేశారనే ఆరోపణలున్నాయి.

కేయూ భూముల వివాదంలో అశోక్‌బాబుకు షోకాజ్ నోటీసులు

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 27: కేయూ భూముల సర్వేపై వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారాలు చేసిన ఆర్ట్‌అండ్‌సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఏఆర్) పెండ్లి అశోక్‌బాబుకు కేయూ రిజిస్ట్రార్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేయూ అధ్యాపక సంఘం (ఆకుట్), విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు సర్వేనెంబర్ 229లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. 2020లో కేయూ భూముల పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా ఉన్న పెండ్లి అశోక్‌బాబుకు తన ఇళ్లు కేయూ భూమిలో ఉందని తెలిసి కూడా తనకు తాను కమిటీ నుంచి వైదొలగకుండా కమిటీతో ఉద్దేశకపూర్వకంగానే సన్నిహితంగా ఉన్నాడని నోటీసులో పేర్కొన్నారు. 2023లో ఆయన కమిటీ కన్వీనర్ బాధ్యతల నుంచి తొలిగించి విజిలెన్స్, మునిసిపాలిటీ, రెవెన్యూ ఆధ్వర్యంలో సర్వే చేయగా 229 సర్వేనెంబర్‌లో పెండ్లి అశోక్‌బాబుతోపాటు, మరి కొంత మంది నిర్మాణం చేసినట్లు గుర్తించారు. కాగా, బాధ్యతాయుతమైన ఉద్యోగిగా ఉండి కేయూ భూమిలో ఇళ్లు నిర్మాణం చేయడమే కాకుండా సర్వే సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే విధంగా తప్పుడు ప్రచారాలు చేసిన అశోక్‌బాబుపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు.

127 కిలోల గంజాయి పట్టివేత

గాలివారి గూడెంలో రూ.31.75 లక్షల విలువైన సరుకు స్వాధీనం



మరిపెడలో మాట్లాడుతున్న మానుకోట ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 27 : గంజాయిపై మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పటికికప్పుడు హైఅలర్ట్‌గా ఉంటుందని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. మత్తుపదార్థాల విక్రయం, రవాణా చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. శుక్రవారం మరిపెడ మండలం గాలివారిగూడెం ఏఎన్ఆర్ గార్డెన్ దగ్గర మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తన సిబ్బందితో వాహన తనిఖీ చేస్తుండగా ఓ కారులో సీలేరు నుంచి హైదరాబాద్‌కు 127 కిలోల శుద్ధి చేసిన గంజాయి తరలిస్తుండగా పట్టుబడింది. ఎస్పీ మరిపెడ పీఎస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కుంటా మండలం అసీర్‌గూడెంకు చెందిన రెవెన్యూ ఉద్యోగి సోడి నాగేశ్వర్‌రావు క్విడ్ రినాల్ట్ కారులో శుద్ధిచేసిన 62 ప్యాకెట్లు (127 కిలోల) గంజాయిని సీలేరు నుంచి హైదరాబాద్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో మరిపెడ పోలీసులకు చిక్కారు. గంజాయిని, ఆ కారు సీజ్‌చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.31.75 లక్షలు ఉంటుదని ఎస్పీ పేర్కొన్నారు. స్థానిక ఎస్సైలు సతీశ్‌గౌడ్, సంతోష్, ట్రైనీ ఎస్సై అశోక్‌ను ప్రశంసించి, రివార్డు అందచేశారు. పలువురు పీసీలకు సైతం నగదు పారితోషకం అందించారు. మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జూడో పోటీల్లో గురుకుల విద్యార్థులకు స్వర్ణ పతకాలు



బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులు

మడికొండ, సెప్టెంబరు 27: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్రీ భవన్‌లో ఈనెల 25, 26 తేదీలలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు స్వర్ణపతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వ రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14 విభాగంలో జి. దీపిక, కె. సహజ, తహసీయత, హిమవర్షిణి స్వర్ణపతకాలు, కె. సహస్ర కాంస్య పతకం సాధించారన్నారు. స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థినులు అక్టోబరు 3 నుంచి 7 వరకు గుజరాత్‌లోని మెహసాన్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్పష్టం చేశారు. ఈసందర్భంగా జూడో శిక్షకులు నాగరాజు, పీడీ పద్మ, పీఈటీ సరిత సహకరించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందాన్ని, పతకాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

సుదీర్ఘకాలం తర్వాత బదిలీలు.. జారీ అయిన మార్గదర్శకాలు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) పరిధిలో పనిచేసే విద్యుత్ ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేశారు. ఒకే చోట రెండేళ్లకు మించి పనిచేస్తున్న ఉద్యోగులను మొత్తం క్యాడర్ స్ట్రెంత్‌లో 50శాతం మించకుండా బదిలీ చేస్తారు. వివిధ ఉద్యోగు సంఘాల్లో పని చేస్తున్న జిల్లా స్థాయి ప్రతినిధులు, ఇంకో ఏడాదిలో రిటైర్ అయ్యే ఉద్యోగులు, భార్యాభర్తలయిన ఉద్యోగులు (స్పౌజ్ కేసు), దివ్యాంగులైన ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, ప్రత్యేకావసరాల పిల్లలు కలిగిన ఉద్యోగులకు బదిలీల్లో వెసులుబాటును కల్పించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని పదహారు జిల్లాల్లో వివిధ కేడర్లలో బదిలీ అయ్యే అవకాశం ఉన్నవారి వివరాలతో కూడిన జాబితాను ఈనెల 28వ తేదీన అన్ని సర్కిల్ కార్యాలయాల్లో అలాగే ఎంప్లాయిస్ ట్రాన్స్‌ఫర్ పోర్టల్‌లో ప్రదర్శిస్తారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 30వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఉద్యోగుల నుంచి బదిలీల్లో ఐచ్ఛికాలను పేర్కొంటూ దరఖాస్తులను అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5.30గంటల వరకు స్వీకరిస్తారు. అక్టోబర్ 7వ తేదీన బదిలీ ఉత్తర్వులను జారీ చేస్తారు. బదిలీ అయిన ఉద్యోగులంతా అక్టోబర్ 9వ తేదీలోగా రిలీవ్ కావలసి ఉంటుంది. బదిలీలపై నిషేధం మళ్లీ అక్టోబర్ 8వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. నిషేధం అమలులోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రత్యేకమైన కేసుల్లో మినహా ఇక ఎలాంటి బదిలీలు ఉండవు.

బదిలీ అయ్యే ఉద్యోగులు

డివిజనల్ క్యాడర్ ఉద్యోగులు అయిన లైన్ ఇన్స్‌పెక్టర్లు మొదలు కొని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఉద్యోగులను వారు ప్రస్తుతం పనిచేస్తున్న సెక్షన్ నుంచి బయటి సెక్షన్‌కు డివిజనల్ ఇంజనీర్ బదిలీ చేస్తారు. సర్కిల్ కేడర్ ఉద్యోగులైన సబ్‌ఇంజనీర్లు, జేఏవో, ఎఫ్ఎం, ఎస్ఎల్ఐ, జనరల్ సర్వీస్‌లో పనిచేస్తున్న సిబ్బంది మొదలు అకౌంటింగ్ విభాగంలో పని చేసే ఉద్యోగులను అదే సర్కిల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న సబ్ డివిజన్ నుంచి మరో డివిజన్‌కు సూపరింటెండింగ్ ఇంజనీర్ బదిలీ చేస్తారు. అలాగే హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న జేఏవోలు మొదలు.. సబ్ ఇంజనీర్ల వరకు వివిధ సెక్షన్లకు లేదా వివిధ ప్రదేశాలు, విభాగాలకు కార్పొరేట్ కార్యాలయం సంబంధిత ఉన్నతాధికారి బదిలీ చేస్తారు. 2024 జూన్ 30వ తేదీ నాటికి ఒకే చోట రెండేళ్లు పని చేసిన ఏఈ, ఏఏఈ, ఏడీఈ (ఎలక్ట్రికల్) క్యాడర్ ఉద్యోగులను సూపరింటెండెంట్ సర్కిల్‌పరిధిలోని వివిధ డివిజన్లకు, కార్పొరేట్ కార్యాలయం బయటి సర్కిల్‌కు బదిలీ చేస్తారు.

కార్పొరేట్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు అయిన ఏఈ, ఏఏఈ, ఏడీఈ (ఎలక్ట్రికల్) ఉద్యోగులను హెడ్‌క్వార్టర్ బయటకు, లేదా సర్కిల్ బయటకు బదిలీ చేస్తారు. అలాగే ఏఈ, ఏఏఈ (సివిల్) అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లను ఇదే సర్కిల్ లేదా వారి అభ్యర్థన మేరకు బయట సర్కిల్‌కు బదిలీ చేస్తారు. ఏఈఈ (సివిల్) డివిజనల్ ఇంజనీర్ ఉద్యోగులను వారు పని చేస్తున్న సర్కిల్ పరిధిలో లేదా బయట సర్కిల్‌లోని వేరే ప్రాంతాలకు బదిలీ చేస్తారు. అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్లను సర్కిల్ బయట వేరు వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తారు. పీఅండ్‌జీ సర్వీస్‌కు సంబంధించిన అసిస్టెంట్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్రెటరీ ఉద్యోగులను కార్పొరేట్ కార్యాలయంలో లేదా సర్కిల్‌లోని వేరే సెక్షన్లలోకి బదిలీ చేస్తారు ఉద్యోగుల బదిలీలు నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా జరుగుతాయని, బదిలీల సందర్భంగా ఉద్యోగులు పైరవీలకు పాల్పడినా, లేదా ఎవరికైనా లంచాలు ఇచ్చినా అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్టు సీఎండీ వరుణ్‌రెడ్డి హెచ్చరించారు. ప్రలోభాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



భద్రకాళి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

భద్రకాళి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 27: ప్రసిద్ధిగాంచిన వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి ఆలయ ఈవో శేష భారతి, అర్చకులు భద్రకాళి శేష సీఎంను కలిసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అక్టోబరు 3 నుంచి 12వరకు జరిగే దేవి శరన్నవరాత్రి మహోత్సవాల వాల్ పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీఎం ను కోరారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

అఖిల భారత పద్మశాలీ సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం



బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈగ మల్లేశం

ఆటోనగర్, సెప్టెంబరు 27: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గ్రేటర్ వరంగల్ కొత్తవాడలో బాపూజీ 109వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మల్లేశం బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో 1915వ సంవత్సరం సెప్టెంబరు 27న జన్మించాడని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నిరంకుశ వ్యతిరేక ఉద్యమంలో బాపూజీ చురుకుగా పాల్గొన్నాడన్నారు. 1952లో ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు ప్రాతినిధ్యం వహించి, ఆ తర్వాత కూడా శాసనసభ్యుడిగా ఎన్నికై 1971 వరకు కొనసాగారన్నారు. బాపూజీ 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలివేశాడని కొనియాడారు. సెప్టెంబరు 21, 2012లో హైదరాబాద్‌లో బాపూజీ 97 సంవత్సరాల వయస్సులో మరణించాడని తెలిపారు. బాపూజీకి భారతరత్న దక్కాలని అవసరమైన సిఫారసులను తెలంగాణ ప్రభుత్వం చేపట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసినట్టు మల్లేశం తెలిపారు. భావి తరాలకు బాపూజీ జీవిత చరిత్ర తెలసే విధంగా పాఠ్యాంశాలలో పొందుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు గుండు ప్రభాకర్, వడ్నాల నరేందర్, గుండేటి నరేంద్రకుమార్, ఆడేపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 27: ఆవోపా హనుమకొండ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికిగాను బంగారు పతకాలను అందించనున్నట్లు ఆవోపా అధ్యక్షులు వల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇమ్మడి పుల్లయ్య, విద్యా కమిటీ చైర్మన్ దేసు సదానందంలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 2023- 24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు 61 కోర్సులకు ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆవోపా హనుమకొండ సుబేదారిలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 9440636447, 9949875510 నెంబర్లలో సంప్రదించాలని వారు ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

'మేడిగడ్డ' నిర్మాణ సంస్థకు గుబులు

- బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దుతో కలవరం
- తొలుత మరమ్మతులను నిరాకరించిన ఎల్అండ్‌టీ
- రూ.500 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన..
- ఆతర్వాత రూ.155 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు



మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 27: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేయడంతో బ్యారేజీ నిర్మాణ సంస్థలో గుబులు మొదలైంది. ఇప్పటి వరకు బ్యారేజీ తాత్కాలిక మరమ్మతుల కోసం వెచ్చించిన రూపాయలతో పాటు శాశ్వత మరమ్మతుల భారం నిర్మాణ సంస్థపైనే పడుతుందనే ఆందోళనలో పడింది. తొలుత బ్యారేజీ కుంగుబాటుకు గురికాగా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతుల కోసం రూ.500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నిర్మాణ సంస్థ ప్రతిపాదించింది. కానీ, నిర్మాణ సంస్థే ఖర్చులు భరించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోతే కుంగుబాటు మరింత విస్తరించే అవకాశం ఉందని నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ భావించింది. తాత్కాలిక మరమ్మతులకు ఉపక్రమించి పనులు చేపట్టింది. అయితే తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.155 కోట్లు వెచ్చించడంతో పాటు ఇతర పరీక్షల నిమిత్తం ఆ మొత్తాన్ని విడుదల చేయాలని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కంప్లీషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేయడంతో ఆ భారం నిర్మాణ సంస్థే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దు కావడంతో బ్యారేజీ శాశ్వత మరమ్మతుల భారం తమపైనే పడుతుందని నిర్మాణ సంస్థ ఆందోళనలో పడినట్లు తెలిసింది. అయితే.. అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ అఫ్కాన్ కంపెనీ, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ కంపెనీ మరమ్మత్తుల కోసం పెట్టిన ఖర్చుల మొత్తాన్ని భరించాయి. కానీ, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ మాత్రం తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత మరమ్మతులకు అవసరమయ్యే మొత్తం నిధులు విడుదల చేయాలని కోరింది. ఇదిలా ఉంటే లింక్-1లోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో పరీక్షల నిమిత్తం ప్రభుత్వం రూ.5 కోట్లు మాత్రమే కేటాయించింది. కాగా, కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజనీర్‌తో పాటు ఇతర అధికారులు ఎవరనే చర్చ మొదలైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ఘటనతో నిర్మాణ సంస్థ రూ.10వేల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులను కోల్పోయినట్లు సమాచారం.

అధికారుల్లో ఆందోళన

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నేపథ్యంలో సంబంధిత ఇంజనీర్లపై కాళేశ్వరం ఎంక్వైరీ కమిషన్ క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్న వార్తల నేపథ్యంలో అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఏఈఈ నుంచి ఈఎన్‌సీ వరకు సుమారు 20 మంది ఇంజనీర్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుండటంతో టెన్షన్ నెలకొంది. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తికాకున్నా అయినట్లు ఇచ్చిన కంప్లీషన్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేయడంతో ఇక తమపై చర్యలు తప్పవనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజనీర్‌తో పాటు ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఎవరనే చర్చ మొదలైంది.

ఆర్అండ్‌బీలో లంచావతారులు

- పెట్రోల్ బంక్ ఎన్‌వోసీ కోసం లంచం డిమాండ్
- డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన జనగామ ఈఈ, ఏటీవో



దొరికిన డబ్బులు

జనగామ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, భవనాల శాఖలోని ఇద్దరు లంచావతారులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఎన్‌వోసీ జారీ విషయంలో లంచం తీసుకుంటూ ఓ ఈఈ, ఏటీవో అడ్డంగా దొరికిపోయారు. ఈ సంఘటన జనగామ కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, బాధితుడు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి చిర్ర సత్యపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘనపురం మండలం బండ్లగూడెం గ్రామానికి చెందిన చిర్ర సత్యపాల్ రెడ్డి సతీమణి నీల పేరిట లింగాలఘనపురంలో ఆరు నెలల క్రితం ఓ కంపెనీ పెట్రోల్ బంక్ మంజూరైంది. బంక్ ఏర్పాటు చేసేందుకు గానూ నిబంధనల ప్రకారం జిల్లా పంచాయతీ అధికారి, ఆర్అండ్‌బీ ఈఈ, జనగామ ఏసీపీ నుంచి 'నో అబ్జక్షన్'(ఎన్‌వోసీ) తీసుకురావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎన్‌వోసీ కోసం ఆర్అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుస్సేన్‌ను చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇటీవల సంప్రదించగా ఎన్‌వోసీ జారీ చేయాలంటే రూ.17 వేలు ఇవ్వాలని హుస్సేన్ డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దాంతో ఏసీబీ అధికారుల పథకం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో హుస్సేన్‌కు సత్యపాల్‌రెడ్డి రూ.12వేలు ఇవ్వగా.. కార్యాలయంలో పనిచేసే అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌కు కూడా రూ.2వేలు ఇవ్వాలని హుస్సేన్ సూచించారు. దీంతో సత్యపాల్ రెడ్డి ఇద్దరికీ లంచం ఇచ్చాడు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు హుస్సేన్, రవీందర్‌ను అదుపులోకి తీసుకుని, వారు సత్యపాల్‌రెడ్డి నుంచి లంచంగా తీసుకున్న డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఈఈ హుస్సేన్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌పై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.


కాగా.. కలెక్టరేట్‌లో ఏసీబీ దాడులతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఆర్అండ్‌బీ అధికారులు హుస్సేన్, ఏటీవో రవీందర్ ఏసీబీకి చిక్కారన్న వార్తతో అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.



మృతి చెందిన మల్లం యాకయ్య

మంత్రాల నెపంతో వృద్ధుడి దారుణ హత్య

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలో ఘటన



మల్లం యాకయ్య (ఫైల్)

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 27: మూఢవిశ్వాసాలు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. అనారోగ్యానికి గురైనా, ఇంట్లో మంచి జరుగకపోయినా మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో అమాయకులను చంపుతున్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో శుక్రవారం జరిగిన ఓవృద్ధుడి హత్యే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనకు సంబంధించి తొర్రూరు సీఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నముప్పారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య (70) ఏళ్ల వృద్ధుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. అదే గ్రామానికి మల్లం రాజు అనే వ్యక్తి తరుచూ జ్వరంతో అనారోగ్యానికి గురవుతున్నాడు. ఈ అనారోగ్యానికి కారణం యాకయ్య అని, తనకు మంత్రాలు చేయడంతోనే రోగాల బారిన పడుతున్నానని, ఆయనను చంపాలని నిర్ణయించుకున్నాడు. చిన్నముప్పారం గ్రామశివారుకు వెళ్తున్న సమయంలో ఉదయం ముత్యాలమ్మగుడి వద్ద మాటువేసి, అటుగా వస్తున్న యాకయ్య తలపై మంచం కర్రతో కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యాకయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐజగదీష్ వివరించారు. కాగా, రాజును గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మృతుడికి భార్య సోమక్క, కుమారుడు రమేష్, కుమార్తె ఉన్నారు. కుమారుడు రమేష్ ఫిర్యాదుమేరకు నిందితుడు రాజుపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యాకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు సీఐ జగదీష్ తెలిపారు.

పీఆర్‌సీ ఫిట్‌మెంట్ నివేదికను సమర్పించాలి

హనుమకొండటౌన్, సెప్టెంబర్ 27: 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ నివేదికను సమర్పించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్-గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేసి 5శాతం ఐఆర్ ప్రకటించిందన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి నివేదిక సమర్పించలేదని, ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నందున నివేదిక సమర్పించాలన్నారు. జోనల్ వ్యవస్థను రద్దుచేసి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సీనియారిటీ లిస్టులు తయారు చేసి ఉద్యోగులు నష్టపోకుండా చూడాలన్నారు.

కాకతీయుల కట్టడాలను పరిరక్షించాలి

- ఎంపీ నిధులతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఎంపీ కడియం కావ్య
- కోటలో ఘనంగా కార్యక్రమం



ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాలను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద




సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ కడియం కావ్య

ఖిలావరంగల్, సెప్టెంబరు 27: కాకతీయుల అద్భుత కట్టడాలు, కళాఖండాలను పరిరక్షించాలని, వాటి ఔన్నత్యాన్ని ముందుతరాలకు తెలియజేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖిలావరంగల్ మధ్యకోటలో వరంగల్ జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాకతీయ రాజులు దక్షిణ భారతదేశం, ఓరుగల్లు సామ్రాజ్యాన్ని సుమారు 300 ఏళ్ల పరిపాలించారన్నారు. వారికాలంలో పరిపాలనతోపాటు యుద్ధవిద్యలు, కళలు, అద్భుత కళాఖండాలను నిర్మించారన్నారు. కాకతీయుల చరిత్ర చాలా గొప్పదని, విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. తన నిధుల నుంచి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానన్నారు.

కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక రంగాల్లో పర్యాటక రంగంపై అవగాహన కలిగి, సంస్కృతులను గౌరవించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. జిల్లాలోని పర్యాటక పర్యాటక ప్రాంతాలను విద్యార్థులు సందర్శించి కాకతీయుల అద్భుత కళాఖండాలు, శిల్పాసౌందర్యాల ప్రాశస్త్యంపై అవగాహన కలిగిఉండాలన్నారు. హాస్పిటాలిటీ సెక్టార్‌లో నైపుణ్యం కలిగిన టూరిస్టు గైడ్‌లుగా, వలంటీర్లుగా విద్యార్థులను తీర్చిదిద్దడం చాలా అవసరమన్నారు. ప్రతీ కళాశాల, పాఠశాలలో ఒక ప్రత్యేక టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసి, వాటి పనితీరుపై బాధ్యత వహించేలా ఫ్యాకల్టీ, స్టూడెంట్ కో-ఆర్డినేటర్‌లను ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు కాకతీయ రాజుల కళాఖండాలు, శిల్పసౌందర్యాల గురించి కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖల సిబ్బంది శ్రీకాంత్, రవియాదవ్‌లను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఖిలావరంగల్‌కు వచ్చిన ఎంపీ కావ్యకు కలెక్టర్ స్వాగతం పలికారు. ఖుష్‌మహల్ నుంచి శిల్పాల వరకు కళాశాల, పాఠశాల విద్యార్థులు, అధికా రులు, టూరిజం యూత్ క్లబ్ సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధారాణి, జిల్లా టూరిజం అధికారి శివాజీ, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి జ్ఞానేశ్వర్, ఖిలావరంగల్ మండల తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాధికారులు, వివిధ శాఖాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లాలోని విద్యార్థులను కాకతీయ కట్టడాలను శుక్రవారం సందర్శించారు. కోట, వేయిస్థంభాల దేవాలయం, భద్రకాళీ దేవాలయ తదితర ప్రాంతాలను టూరిజం ప్యాకేజీలో భాగంగా పర్యటించగా, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ 80మంది విద్యార్థులకు కాకతీయుల చరిత్రను వివరించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



విజేందర్(ఫైల్)



తండ్రి అంత్యక్రియల్లో కూతుర్లు

శంభునిపేట, సెప్టెంబరు 27: ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మామునూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణవేణి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం చింతనెక్కొండకు చెందిన దబ్బెట వెంకటయ్య, కట్టమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు. చిన్నకుమారుడు దబ్బెట విజేందర్ (32) 2012లో కానిస్టేబుల్‌గా ఎన్నికయ్యాడు. కుటుంబ సభ్యులతో రంగశాయిపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న విజేందర్ ప్రస్తుతం తొర్రూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున విజేందర్ విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై రంగశాయిపేటకు బయలుదేరాడు. తొర్రూరు మండలం దంతాలపల్లి నుంచి కర్రలోడుతో నగరానికి వస్తున్న ట్రాక్టర్‌లోని కొన్ని దుంగలు మామునూరు చెరువు కట్ట వద్ద కిందపడ్డాయి. ట్రాక్టర్ డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా అలాగే ముందుకు వెళ్లి పోయాడు. దీంతో అదే సమయంలో వెనుకాలే ద్విచక్రవాహనంపై వస్తున్న విజేందర్‌రెడ్డి దుంగలను ఢీకొట్టి అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మామునూరు ఎస్‌ఐ కృష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. విజేందర్‌కు భార్య శ్రావణి, ఇద్దరు కూతుర్లు శాన్వి, విస్సీలు ఉన్నారు. శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ అధికారులపై రాడ్లతో దాడి

'పోడు'ను అడ్డుకునేందుకు వెళ్లిన క్రమంలో దుండగుల దుశ్చర్య

తాడ్వాయి మండలం దామెరవాయి వద్ద ఘటన

ఎక్స్‌కవేటర్ యజమాని సహా ఐదుగురి అరెస్టు



హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అటవీశాఖ అధికారులను పరామర్శిస్తున్న రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

తాడ్వాయి / ములుగు/ ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 27: అటవీ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ సాయంతో పోడు చేస్తుండగా అడ్డుకున్న అటవీఅధికారులపై ఆ ఎక్స్‌కవేటర్ యజమాని, అతని అనుచరులు ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ సెక్షన్, ఓ బీట్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం దామెరవాయి సమీపంలో గురువారం రాత్రి 11.30గంటల సమయంలో జరిగిన ఈ ఘటన గురించి పోలీసులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామెరవాయి సమీపంలోని అటవీ భూమిలో కొందరు వ్యక్తులు యంత్రాలతో చెట్లను తొలగించి పోడు చేస్తున్నారని తెలుసుకున్న సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారులు శరత్‌చంద్ర, సుమన్, బేస్‌క్యాంపు ఉద్యోగి ఎట్టి శ్రీను, డ్రైవర్ రాజేందర్ గురువారం రాత్రి ఆ ప్రాంతానికి జీపులో వెళ్లారు. ఈ క్రమంలో ఎక్స్‌కవేటర్‌తో యజమాని గంట సూరజ్‌రెడ్డి వారికి ఎదురురాగా.. అతడిని విచారించిన అధికారులు యంత్రాన్ని స్వాధీనం చేసుకుని తాడ్వాయి రేంజ్ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ లోపు విషయం తెలుసుకున్న సూరజ్‌రెడ్డి అనుచరులు అక్కడకు చేరుకుని అధికారుల వాహనాలకు అడ్డు తగిలారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలై అది కాస్తా పెద్దదైంది. ఈ క్రమంలో సూరజ్‌రెడ్డి, అతని అనుచరులు ఇనుప రాడ్లతో అటవీశాఖ అధికారులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఎఫ్ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీవో శరత్‌చంద్ర తలలు పగలడంతోపాటు చేతివేళ్లు విరిగాయి. అటవీశాఖకు చెందిన జీపును కూడా వారు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న తాడ్వాయి పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి గాయపడ్డ అటవీ అధికారులను తాడ్వాయి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తాడ్వాయి డిప్యూటీ రేంజ్ అధికారి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనలో గంట శశిధర్ అనే వ్యక్తికి కూడా గాయాలవగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోడు చేసేందుకు ఉపయోగించారని అనుమానంతో పోలీసులు ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. ఇదిలా ఉంటే ఆ యంత్రంతో అటవీ ప్రాంతంలో చెట్లను తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు. దామెరవాయికి చెందిన ఓ రైతు తన పట్టా భూమిలో గతంలో జామాయిల్ చెట్లను పెంచగా వాటిని కోసిన అనంతరం భూమిలో ఉన్న మోట్లను తొలగించి చదును చేసేందుకు ఆ యంత్రాన్ని కిరాయికి తెచ్చుకున్నాడని తెలిపారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత పని ముగించుకొని వస్తున్న క్రమంలో అటవీశాఖ అధికారులు అడ్డుకోగా అది ఘర్షణకు దారితీసిందని చెబుతున్నారు. అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడ్డ వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధికారులు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెక్షన్, బీట్ అధికారులను వారు పరామర్శించారు. ఇక నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ, కలెక్టర్

విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరైనా దాడికి పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్, పీడీ యాక్టు సైతం నమోదు చేస్తామని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీష్ వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. ఇక అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై దాడి చేసిన కేసులో గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్‌రెడ్డి, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటి అనే వ్యక్తులను శుక్రవారం సాయంత్రం కాటాపూర్ క్రాస్‌వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ శబరీశ్ వెల్లడించారు.

ఫోన్‌లో సీతక్క పరామర్శ

దామెరవాయి దగ్గర జరిగిన దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందున్న అటవీశాఖ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్‌చంద్రలను మంత్రి సీతక్క శుక్రవారం ఫోన్‌లో పరామర్శించారు. సీసీఎఫ్, డీఎఫ్‌వోలతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకోవడంతో పాటు గాయపడిన అధికారులకు మెరుగైన వైద్యం అందించాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఫారెస్టు అధికారులకు మంత్రి సురేఖ పరామర్శ

రెడ్డికాలనీ, సెప్టెంబరు 27: ములుగు జిల్లా తాడ్వాయి రేంజ్ దామరవాయి బీట్ -2 అటవీ ప్రాంతంలో దుండగులు చేసిన దాడిలో గాయపడి ములుగురోడ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ శరత్‌చంద్రలను అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. శుక్రవారం ఆ ఆస్పత్రికి వెళ్లిన మంత్రి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. దాడికి దారి తీసిన పరిస్థితులను డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ మంత్రి సురేఖకు వివరించారు. అధికారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణే ధ్యేయంగా సైనికుల్లా పోరాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసే వారు ఏ స్థాయి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అటవీశాఖ అధికారులపై జరుగుతున్న దాడులు, వారు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని, ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తానని మంత్రి తెలిపారు.



ఫారెస్టు అధికారుల దాడిలో గాయపడ్డ మహాముత్తారం ఎస్సీ కాలనీ వాసులు

నలుగురు వ్యక్తులపై ఫారెస్టు అధికారుల దాడి

మహాముత్తారం ఎస్సీకాలనీకి చెందిన వ్యక్తికి తీవ్ర గాయం

మహాముత్తారం, సెప్టెంబరు 27: మహాముత్తారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తోటపల్లి సమ్మయ్య, రామిండ్ల సురేష్, మంతెన రాజబాపు, గంధం ఎంకయ్య అనే వ్యక్తులపై శుక్రవారం మధ్యాహ్నం ఫారెస్టు అధికారులు దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వంట చెరకు కోసం అడవికి వెళ్లిన తాము కట్టెలు పోగు చేసుకుంటుండగా ఇద్దరు ఫారెస్టు అధికారులు వచ్చి తమను అకారణంగా కర్రలతో కొట్టారని తెలిపారు. తాము కట్టెలు సేకరించేందుకు వెళ్లిన ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో పోడు జరుగుతున్నా పట్టించుకోని ఫారెస్టు అధికారులు వంట చెరకు కోసం వెళ్లిన తమపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఫారెస్టు అధికారులపై మహాముత్తారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏఎస్సై మహేందర్‌ను సంప్రదించగా ఫారెస్టు అధికారులు దాడి చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఘటనలో తోటపెల్లి సమ్మయ్య చేయి విరగ్గా, మిగిలిన వారికి గాయాలవగా భూపాలపల్లి ఆస్పత్రికి తరలించామన్నారు.



రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్న కమిటీ ప్రతినిధులు

రోడ్డుకు మరమ్మతు పనులు

వరంగల్‌సిటీ, సెప్టెంబరు 27: నగరంలోని 14వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్(సుధాకర్ హోటల్ వద్ద) ప్రధాన రహదారి దెబ్బతినడంతో గత కొద్దినెలలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎన్‌టీఆర్‌నగర్ గ్రామ కమిటీ ప్రతినిధులు కొత్తపల్లి యాదగిరి, అడువ మహేష్, శ్రీరాం రఘుపతి స్పందించి రెడీమిక్స్‌తో కాంక్రీట్ వేయించి మరమ్మతు పనులు చేయించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గన్నీ బ్యాగుల ధర పెంచి రైతులకు ఇప్పించాలి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 27: గన్నీబ్యాగుల ధర పెంచి రైతులకు ఇప్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి పోలె పాక నిర్మలను కలిసింది. రైతుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతిప త్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్కెట్‌కు రోజు వేలా దిమంది రైతులు తమ ఉత్పత్తులను గన్నీబ్యాగులలో తీసుకుని వచ్చి అమ్ముకుం టారని, వారు బయట రూ.80 ఒక్క గన్నీబ్యాగులను తీసుకుంటే వ్యాపారులు మాత్రం రూ.30 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రూ.30 కూడా కొం దరు చెల్లించడం లేదని వాపోయారు. కార్యదర్శి చొరవ తీసుకుని రూ.50 పెంచి వ్యాపారులచే రైతులకు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఊరటి హంసాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓడెల రాజయ్య పాల్గొన్నారు.

అంకాపూర్‌కు రైతుల విజ్ఞాన యాత్ర



అంకాపూర్‌లోని పంట క్షేత్రాలను సందర్శించిన ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, రైతులు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 27: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వరంగల్(ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థికసాయంతో 50మంది రైతులను విజ్ఞానయాత్ర తీసుకెళ్లారు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామంలోని పంట క్షేత్రాలకు వెళ్లి పరిశీలించడం జరిగిందని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ రాములు తెలిపారు. ఈ సందర్భంగా పసుపు, మిర్చి, మొక్కజొన్న, పంటలను పరిశీలించి అక్కడి రైతులతో సాగుకు సంబంధించిన వివరాలను రైతులకు వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గురడి రైతు సంఘం అధ్యక్షుడు అనంత్, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, బొజ్జన్న, నర్సారెడ్డి, వ్యవసాయ విస్తీర్ణాధికారి సవిత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్ వద్ద కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యమకారులు

శంభునిపేట, సెప్టెంబరు 27 : మామునూరులోని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్‌లో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి కమాండెంట్ బి.రాంప్రకాశ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి నిలువెత్తు నిదర్శనం లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో బాపూజీ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్‌ఐలు శోభన్, రవి, నర్సర్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ అధికారులు పాల్గొన్నారు.

● ఆర్టీఏ జంక్షన్‌లో 43వ డివిజన్ తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూంపల్లి జయశంకర్, యాడాల జగపతి, జోరిక సదానందం, కలకోట్ల క్రాంతి, అంబాల ఉదయ్ కిరణ్, వస్కుల ప్రసాద్, యాడాల రమ్యశ్రీ, ఇల్లందుల రవి, మైదం వీరస్వామి, బిక్షపతి, కృష్ణ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను నేటి యువత కొనసాగించాలని పోపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ అన్నారు. 34, 35వ, డివిజన్ పద్మశాలి కమ్యూనిటీ భవనంలో 35వ పద్మశాలి డివిజన్ అధ్యక్షుడు గద్దం రవి అధ్యక్షతన బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివనగర్ పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యద ర్శులు బుధరాపు బాస్కర్, ఆడెపు శ్యామ్, నాయకులు మేరుగు అశోక్, శ్రీరాం రాజేష్, కొడంప్రతాప్, సింగం శ్రీనివాస్ పాల్గొన్నారు. 34వ, డివిజన్ పోపా కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోపా జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్, గోపికొండ సుధాకర్, ధర్మపురి రాజ గోవిందు, మాటేటి అశోక్‌కుమార్, పెద్దూరి పెద్దన్న, సుధాకర్, పాల్గొన్నారు.

● కాశిబుగ్గ: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని కాశిబుగ్గ ఓసిటీ కూడలిలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవా సమితి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకెన వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొణతం కృష్ణ, పెరుమాండ్ల లక్ష్మణ్, దయాకర్, శ్రీనివాస్, మురళీకృష్ణ, సుధాకర్, ఎల్లయ్య, రవి, ప్రభాకర్, సారంగపాణి పాల్గొన్నారు. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, సామల రమేష్, శంకర్, సారంగపాణి, శేఖర్ పాల్గొన్నారు.

భిన్నసంస్కృతులను అర్థం చేసుకోవటమే పర్యాటకం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న రేవూరి

గీసుగొండ, సెప్టెంబరు 27: ప్రకృతిలోని అందాలను తిలకిస్తూ, భిన్న సంస్కృతులను అర్థం చేసుకోవటమే పర్యాటక లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో పాల్గొని పర్యాటక ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. రేవూరి మాట్లాడుతూ బాపూజీ కలల స్వరాజ్యం గంగదేవిపల్లిలో కనబడుతుందని, అలాంటి గ్రామంలో పర్యాటక దినోత్సవాన్ని జరపడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ దసరా సెలవుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని పర్యాటక ప్రదేశాలను సందర్శించటానికి ఉపయోగించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో రాష్ట్రంలో వరంగల్ జిల్లాను 2వ స్థానంలో నిలిపినందుకు కలెక్టర్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గ్రామాలను పరిశుభ్రంగా చేస్తున్న పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, నోట్‌బుక్‌లను అందచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఈవో జ్ఞానేశ్వర్, పర్యాటకశాఖ అధికారి శివాజీ, మండల ప్రత్యేక అధికారి సురేష్, డీఎల్‌పీవో వేదవతి, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రాల్లో నేడు రేబిస్ దినోత్సవం

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని 57 పశువైద్య కేంద్రాలలో ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పశువైద్య కేంద్రాల్లో రేబిస్ వ్యాధి కుక్కలకు సోకకుండా ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. జిల్లాకు 18,700 డోసులను సరఫరా చేయడం జరిగిందని, 8,700 డోసులను మండలాలకు, 10వేల డోసులు కార్పొరేషన్ పరిధిలోని కుక్కలకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. పెంపుడు కుక్కలకు వాటి యజమాని సహాయం, వీధి కుక్కలకు లోకల్ బాడీస్ సహకారంతో టీకాల కేంద్రముకు తీసుకెళ్లి ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తారని వివరించారు. రేబిస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి : కలెక్టర్

● వరంగల్‌లో వృద్ధుల దినోత్సవ ర్యాలీ



వరంగల్ చౌరస్తాలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆటోనగర్, సెప్టెంబరు 27: వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పిల్లలు తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మమైదాన్ సర్కిల్ వరకు శుక్రవారం ర్యాలీని నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల బాధ్యత పిల్లలే చూసుకోవాలన్నారు. వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గందె కల్పన, వరంగల్, వర్ధన్నపేట సీడీపీఓలు విద్య, దెబోరా, సూపర్‌వైజర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, జిల్లా వయోవృద్ధుల కమిటీ మెంబర్లు, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు, వయో వృద్ధులు పాల్గొన్నారు.

ఆలయాలను కాపాడుకుందాం..



ప్రదీప్‌రావుకు జ్ఞాపికను అందిస్తున్న బీజేపీ నాయకులు

శంభునిపేట, సెప్టెంబరు 27: చారిత్రక నేపథ్యమున్న ఆలయాలను కాపాడుకుందామని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. నగరానికి చెందిన బీజేపీ నాయకులు బొరిగం నాగరాజు ఆధ్వర్యంలో ఇటీవల కాశీ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ప్రదీప్‌రావును ఓసిటీలోని వారి నివాసంలో కలిసి కాశీ విశ్వేశ్వర ఆలయ నమూనాతోపాటు ప్రసాదాన్ని అందించారు. నగరంలోని ఖిలావరంగల్ కోటలోని శంభులింగేశ్వరాలయాన్ని కాశీ విశ్వనాథాలయంలా అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్నె రవీందర్, తాబేటి వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

సీపీకి దసరా ఉత్సవ కమిటీ వినతి



సీపీని కలిసిన దసరా ఉత్సవ కమిటీ సభ్యులు

కరీమాబాద్, సెప్టెంబరు 27: నగరంలోని ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం కమిటీ సభ్యులు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను కలిసి కోరారు. సీపీ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రతి ఏటా వేడుకలకు వచ్చే ప్రజల సంఖ్య పెరుగుతోందని, ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించాలని కోరారు.

సీపీ మాట్లాడుతూ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, కమిటీ సభ్యులు, పోలీసులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ డైవర్షన్ చర్యలు తీసుకుంటామనిచ వేడుకలకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, సహాయ కోశాధికారి వెలిదే శివమూర్తి, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షులు గోనే రాంప్రసాద్, నాగపూరి రంజిత్‌గౌడ్, పొగాకు సందీప్, బజ్జూరి వాస, పూదరి అజయ్, బత్తిని అఖిల్‌గౌడ్, నాగపూరి అశోక్, కార్యదర్శులు నరిగే శ్రీను, బొల్లం మధు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న వరంగల్ పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 27: ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రుణ మాఫీ చేయాలని వరంగల్ పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ అన్నారు. ఆరెపల్లిలో శుక్రవారం వరంగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశంలో పీఏసీఎస్ పరిధిలోని రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీతో సంబంధం లేకుండా సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య కార్య నిర్వాహణ అధికారి దామోదర్, వైస్ చైర్మన్ కంకల సదానందం, డైరక్టర్లు నేరెళ్ల రాజు, కాడబోయిన భిక్షపతి, కొండ కుమారస్వామి, నాగవరపు విజయసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం..'



మాట్లాడుతున్న అధ్యక్షుడు గుండు పూర్ణచందర్

శంభునిపేట, సెప్టెంబరు 27: విజయ దశమిని పురస్కరించుకొని రంగశాయిపేటలో నిర్వహించే దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ అన్నారు. శుక్రవారం రంగశాయిపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్ణచందర్ అధ్యక్షతన ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు. పూర్ణచందర్ మాట్లాడుతూ అక్టోబరు 12న దసరా రోజున మహంకాళీ ఆలయ ఆవరణలో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. వేడుకలకు మంత్రి కొండా సురేఖతోపాటు మేయర్ గుండు సుధారాణి, జిల్లా అధికారులు హాజరు కానున్నారని తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి దామెరకొండ కర్ణాకర్ మాట్లాడుతూ.. ఈసారి 36పీట్ల రావణ ప్రతిమను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముత్తినేని రామ్మూర్తి, బీవీ రామకృష్ణ ప్రసాద్, వలపదాసు రాజశేఖర్, కొక్కొండ బాస్కర్, పరికిపండ్ల రాజేశ్వర్‌రావు, బజ్జూరి వీరేశం, పాకాల మనోహర్, కత్తెరపల్లి వేణు, ఎలుగు అశోక్, గుండు నవీన్ కుమార్, పస్తం భిక్షపతి, కన్నెబోయిన కుమార్, ఆడెపు రఘు తదితరులు పాల్గొన్నారు.

20 మంది వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 27: మద్యం దాగి వాహనం నడిపిన కేసులో 20 మంది వాహనదారులకు శుక్రవారం వరంగల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 20 మంది వాహనదారులకు రూ. 28,200 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఆరుగురు వాహనదారులకు రూ. 9000 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మామిడి సీజన్‌లో మార్కెట్లో

క్రయవిక్రయాలు జరపాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెట్ కార్యదర్శి నిర్మల

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబర్ 27: వచ్చే మామిడి సీజన్‌లో ఏనుమాముల మార్కెట్లో క్రయవిక్రయాలకు అవకాశం కల్పించాలని పండ్ల మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెల్ది సాంబయ్య మార్కెట్ కార్యదర్శిని కోరారు. శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను పండ్ల వ్యాపారులు కలిశారు. ఈ సందర్భంగా వెల్ది సాంబయ్య మాట్లాడుతూ.. మరో మూడు నెలల్లో మామిడి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్కెట్లో క్రయ విక్రయాలకు అవకాశం కల్పించాలని, కొత్తగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి దుకాణాలకు కేటాయించాలని కోరారు. మార్కెట్ కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ.. పండ్ల మార్కెట్లో వ్యాపారులు చాలా మంది మార్కెట్ ఫీజు బకాయిలు పడి ఉన్నారని, వారిని వెంటనే ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పండ్ల మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి దొంగల చెన్నమల్లు యాదవ్ పాల్గొన్నారు.

వావ్.. క్రిస్టియన్‌కాలనీ పార్కు

● ఇటీవల ఎన్ఎన్‌సీకి ఎంపికైన పార్కు

● 48 గంటల్లో కమ్యూనిటీ భవనం నిర్మాణం

● 72 గంటల్లో పిల్లల పార్కు ఏర్పాటు



క్రిస్టియన్‌కాలనీలోని కమ్యూనిటీ భవనం, పార్కు ప్రధాన గేటు

ఖిలావరంగల్, సెప్టెంబరు 27: నగరంలోని పార్కులకు జాతీయస్థాయిలో గుర్తింపురావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నైబర్‌హుడ్ చాలెంజ్ పోటీల్లో ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ ను నగరంలోని పలు పార్కులు సొంతం చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) ఆధ్వర్యంలో డిల్లీలో స్మార్ట్‌సిటీ నగరాలకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నర్చరింగ్ నైబర్‌హుడ్ చాలెంజ్ (ఎన్ఎన్‌సీ) పోటీలలో దేశంలోని పది నగరాలకు గుర్తింపు లభించింది. దీనిలో గ్రేటర్ వరంగల్ టాప్-5లో నిలవగా క్రిస్టియన్‌కాలనీ, ఎంహెచ్‌నగర్, కరీమాబాద్‌లో గుండుబావి పార్కులు ఉండడం విశేషం.

48 గంటల్లోనే పార్క్..

గుర్తింపు పొందిన పార్కుల్లో ఒకటైన 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీ పార్క్‌ను 48 గంటల్లో కమ్యూనిటీ భవనం, 72గంటల్లో పిల్లల పార్కును కుడా ఆధ్వర్యంలో నిర్మించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో భాగంగా రూ.72లక్షలతో కమ్యూనిటీ భవనాన్ని, రూ.75 లక్షలతో పార్కును 72గంటలలో నిర్మాణం చేశారు. ఈ పార్కులో రూ.13లక్షలతో 18 గంటల సమయంలో ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు గార్డెనింగ్, మరుగుదొడ్లు, ప్రహరీ, గేటు, గ్రిల్స్ విద్యుత్ దీపాలు, పెయింటింగ్, గోడలపై హరితహారం, తెలుగు ఇంగ్లీషులో అక్షరాలు, రైమ్స్, అద్భుత చిత్రాలతో అందమైన కమ్యూనిటీ గార్డెన్(ఉద్యానవనం), పిల్లల పార్కును నిర్మించారు. గార్డెన్, మెత్తటి లాన్, పచ్చని చెట్లు, పూలు ప్రజలను ఎంతగానో ఆకర్శిస్తున్నాయి. ఇందులో బోగమిల్లా, నూరువర్హా చెట్లు, తెల్ల మల్లె చెట్లు, పెద్దమల్లె చెట్లు, మందార, నందివర్ధనం, పోగడ, సత్యనారాయణ, తదితర పూలలతో పాటు గార్డెనింగ్ షో చెట్లు ప్రత్యేకంగా ఆకర్శిస్తున్నాయి.

పిల్లలు, పెద్దల వాకింగ్

క్రిస్టియన్‌కాలనీలోని గార్డెన్, పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలు, యువకులు వాకింగ్, ఆడుకోవడానికి వస్తుంటారు. పిల్లల కోసం జారుడు బల్లలు, ఊయలలు, పజిల్ బాక్స్, గుర్రం, కుక్క, బైక్, రాట్నం తదితర ఆట వస్తువులు, యువకుల కోసం ఓపెన్ జిమ్, పెద్దల కోసం పార్కులో కుర్చీలు, బల్లలను ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు, యువకులు, పెద్దలు(రిటైర్డు ఉద్యోగులు) సైతం ఒకే చోట కలిసి పచ్చని వాతావరణంలో సేద తీరుతున్నారు.



పార్కులోని పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ జిమ్



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 28 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన ఉద్యమకారులు



నర్సంపేటలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

నర్సంపేట, సెప్టెంబరు 27 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలం గాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ప్రతీ ఉద్యమకారునికి రూ:25వేల చొప్పున పింఛన్, ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేస్తూ సికింద్రాబాద్‌లోని కళాభవన్ శుక్రవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి నర్సంపేటకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు తరలివెళ్ళారు. వెళ్ళిన వారిలో దార్లరమాదేవి, భైరితిరుపతిరెడ్డి, పులిగిల్ల యాద గిరి, పుట్టపాక కుమారస్వామి, దోనాల రవి, స్వామి, సాంబయ్య, పండ్యాల కృష్ణ, శ్రీనివాస్, రజనీకాంత్, వీరారెడ్డి, వెంకట్, మద్దికాయల రాంబాబు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

భిన్నసంస్కృతులను అర్థం చేసుకోవడమే పర్యాటకం



గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, సెప్టెంబరు 27: ప్రకృతిలోని అందాలను తిలకిస్తూ, భిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడమే పర్యాటక లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో పాల్గొని పర్యాటక ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాపూజీ కలల స్వరాజ్యం గంగదేవిపల్లిలో కనబడుతుందని, అలాంటి గ్రామంలో పర్యాటక దినోత్సవాన్ని జరపడం ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడతూ దసరా సెలవుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని పర్యాటక ప్రదేశాలను సందర్శించటానికి ఉపయోగించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో రాష్ట్రంలో వరంగల్ జిల్లాను 2వ స్థానంలో నిలిపినందుకు కలెక్టర్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గ్రామాలను పరిశుభ్రంగా చేస్తున్న పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, నోట్‌బుక్‌లను అందచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఈవో జ్ఞానేశ్వర్, పర్యాటకశాఖ అధికారి శివాజీ, మండల ప్రత్యేక అధికారి సురేష్, డీఎల్పీవో వేదవతి, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

గుట్కా, అంబర్ ప్యాకెట్ల పట్టివేత

పర్వతగిరి, సెప్టెంరు 27 : మండల కేంద్రంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొల్లూరి శంకర్, రంగు జనార్దన్ తమ కిరాణ దుకాణాల్లో విక్రయించడానికి గుట్కాలను తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద సంచులను తనిఖీ చేయగా రూ.37,150 విలువగల గుట్కా, అంబర్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని శంకర్, జనార్ధన్‌లపై కేసు నమోదు చేశారు.

ఘనంగా కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి



నర్సంపేటలో కొండాలక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

నర్సంపేట, సెప్టెంబరు 27 : బడుగు బలహీన వర్గాల హక్కుల రక్షణ కోసం పోరాడిన వ్యక్తి కొండా లక్షణ్ బాపూజీ అని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ అన్నారు. పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చేనేత కులాల కోసం కాకుండా తెలంగాణ ప్రజల హక్కుల కోసం మంత్రి పదవీని వదిలివేసిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కూచన శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీరాముల శంకరయ్య, ఉపాధ్యక్షులు మేరుగు సాంబయ్య, కూచనరవీందర్, పెండెం వెంకటేశ్వర్లు, గాజుల సాంబయ్య, ముఖ్య సలహాదారులు గడ్డం రాజేందర్, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీరాముల కోటేశ్వర్, కార్యదర్శి శ్రీదర్, గాజుల రాము, కోదూరి రవి, పెండెం శివానంద్, కందకట్ల రాజేందర్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏఈ రాజేశ్‌కుమార్, అకౌంటెంట్ రజని, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, బత్తిని రాజేందర్, ముల్కల వినోద అధికారులు పాల్గొన్నారు.

• దుగ్గొండి: మండలంలోని మహ్మదాపురం ప్రభుత్వ హైస్కూల్‌లో డాక్టర్ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి హెచ్‌ఎం కాళీదాసు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఊర్మిళ, నరేందర్, మన్నె బాబు, ఊర్మిళ, ఇంద్రాసేనారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

• సంగెం: మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంగెం పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల నరహరి మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం సహకార రంగాల పటిష్టతకు బాపూజీ కృషిచేశారన్నారు. బాపూజీ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కందగట్ల కళావతి, మల్లయ్య, సదయ్య, రాజు పాల్గొన్నారు.

కోనాపురంలో స్వచ్ఛంద శ్రమదానం



పరిసరాలను శుభ్రం చేస్తున్న యువకులు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 27 : పట్టణంలోని 7వ వార్డు కోనాపురంలో శుక్రవారం కొంత మంది యువకులు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. 7వ వార్డులోని సమస్యలను మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోనాపురంలో కొంతకాలంగా పారిశుధ్య, నీటి సమస్య, విద్యుత్ సమస్యలు తాండవిస్తున్నాయి. విషజ్వరాలతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వార్డుకు ప్రధాన రహ దారిపై లైట్లు లేకపోవడంతో అంధకారం నెలకొంటుంది. దీంతో స్థానిక యువకులు ఏకమై గ్రామంలో పక్కకు పడేసిన విద్యుత్ స్తంభాలను తీసుకువచ్చి చెట్లు, ముళ్ల పొదలను శుభ్రం చేసి స్తంభాలు నాటారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడడం కంటే తమకు చేతనైన పనులను చేస్తూ స్థానిక యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువకులు సిహెచ్.భాస్కర్, బాబు, గాలిబ్, ఎం.యాకయ్య, పి.భిక్షపతి, సతీష్, సిహెచ్.అజయ్, ఇ.అజయ్, హరీష్, పౌలు, చంటి, మున్నాలను స్థానికులు అభినందించారు.

భార్యపై కత్తితో దాడిచేసిన భర్త



దాడికి గురైన కవిత

వర్ధన్నపేట, సెప్టెంబర్ 27 : మనస్పర్థల నేపథ్యంలో భార్యపై భర్త దాడికి పాల్పడిన సంఘటన శుక్రవార వర్ధన్నపేట పట్టణంలో జరిగింది. వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన బొజ్జ వీరన్న, లచ్చమ్మ దంపతుల కుమార్తె కవితకు జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన చొప్పరి రవితో 23ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు కాగా ఒకరు లండన్‌లో, బెంగళూరులో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోగా కవిత కొద్దిరోజులుగా వర్ధన్నపేటలోని తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో గురువారం చొప్పరి రవి వర్ధన్నపేటలోని అత్తింటికి చేరుకుని ఇకపై తన ప్రవర్తన మార్చుకుంటానని, కవితను ఇబ్బందులు పెట్టనని అత్తమామలతో చెప్పి ఒప్పించాడు. అనంతరం అందరూ నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి 12.30 సమయంలో రవి, కవితల మధ్య వాగ్వాదం మొదలైంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రవి ఇనుపరాడ్డుతో కవిత తల, మెడపై కొట్టాడు. కత్తితో మెడ భాగంలో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఈ సమయంలో నిద్ర లేచిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న సిబ్బంది కవితకు ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కత్తిగాటుకు గురైన ప్రాంతంలో 30కుట్లు వేసిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి తండ్రి బొజ్జ వీరన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని వైద్యసేవలందించిన 108 సిబ్బంది నాగరాజు, ఎ.కుమార్‌లను స్థానికులు అభినందించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 27 : మండలంలోని మహేశ్వరం గ్రామంలో శివాని పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై నర్సంపేట అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, డైరెక్టర్ రాహుల్‌వర్మ, స్వాతి, దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలలో రేబిస్ డే

సంగెం, సెప్టెంబరు 27: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ రేబిస్ దినోత్సవం నిర్వహించారు. స్థానిక పశువైద్య అధికారి డాక్టర్ వల్లె రాజు ఆధ్వర్యంలో రేబిస్‌పై అవగాహన కల్పించారు. రేబిస్ వ్యాధి కుక్కకాటుతో వ్యాపిస్తుందని, రేబిస్ వ్యాధిసంక్ర మణ, వ్యాధి లక్షణాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు బుచ్చిరెడ్డి, కుమారస్వామి, నాగరాజు, అనిల్‌కుమార్, రాఖీ, మాధవి పాల్గొన్నారు

ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు మాజీ ఎమ్మెల్యే పెద్దిసుదర్శన్‌రెడ్డి బహిరంగ లేఖ



మంత్రి తుమ్మలకు పంపిన లేఖను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట, సెప్టెంబరు 27 : వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలం కన్నారావుపేటలో హార్టికల్చర్ రిసెర్చ్ సెంటర్‌ను నెలకొల్పితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఇందుకు హార్టికల్చర్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రికి బహిరంగ లేఖ పంపించామని పేర్కొన్నారు. ఉద్యానవన పంటలు పండించే రైతుల సంక్షేమం కోసం హార్టికల్చర్ రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో మాజీ సీఎం కేసీఆర్ సహకా రంతో నియోజకవర్గంలోని కన్నారావుపేటలో ఏర్పాటు కు జీవో 31 ద్వారా హార్టికల్చర్ రిసెర్చ్‌సెంటర్‌ను మంజూరి చేయించుకువచ్చానన్నారు. రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు కోసం కన్నారావుపేటలోని సర్వే నంబర్ 58లో 54 ఎకరాల భూమిని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీకి అప్పగించానని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా రిసెర్చ్ సెంటర్‌కు సంబంధించి పురోగతి, సమీక్షలు జరుపలేదన్నారు. వ్యవసాయరంగానికి, రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఉద్యానవన పరిశోధన సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టి రైతులకు పరిశోధన కేంద్రం అందుబాటులోకి తీసుకురావడానికి చొరవచూపాలని మంత్రిని లేఖలో సుదర్శన్‌రెడ్డి కోరారు. మిర్చి పరిశోధన కేంద్రంతో పాటు సీడ్స్ సైన్సెస్‌కు సంబంధించిన అన్ని రకాల పరిశోధనలకు ఏకైక కేంద్రాన్ని రాష్ట్రంలో నర్సంపేటకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరిచేసిందన్నారు. మంజూరై ఉన్న ఉద్యానవన పరిశోధన కేంద్రం అందుబాటులోకి వస్తే ఒకటి రెండు రోజుల్లోనే పంటలకు సోకిన తెగుళ్లను గుర్తించి నివారణకు అవసరమైన మందులు అందుబాటులోకి వచ్చే అస్కారం ఉంటుందన్నారు. కన్నారావుపేటకు మంజూరైన ఉద్యానవన పరిశోధన కేం ద్రాన్ని రా ష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. రైతుల కోసం 50 శాతం సబ్సిడీపై యంత్రాలను అందించడం కోసం ప్రత్యేక పైలట్ ప్రాజెక్టును రూ:75 కోట్లతో మంజూరీ చేయించానన్నారు. యాంత్రీకరణ పైలట్ ప్రాజక్టు ద్వారా రూ:16 కోట్ల విలువైన యంత్రాలను రైతులకు అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యంత్రాల పంపిణీ నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వం యాంత్రీకరణ ప్రత్యేక పైలట్ ప్రాజెక్టుపై సమీక్షించి రైతులకు ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. వరంగల్ చపాట మిర్చికి గుర్తింపు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

కానిస్టేబుల్ మృతదేహానికి ఎస్పీ నివాళి



విజేందర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

పర్వతగిరి, సెప్టెంబరు 27 : మండలంలోని చింత నెక్కొండ గ్రామానికి చెందిన దబ్బెట విజేందర్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన మృతదేహానికి మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ నివాళులర్పించారు. విజేందర్ తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన స్వగ్రామమైన పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండలో అంత్యక్రియల్లో పాల్గొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కుటుంబ బాధ్యతలను మహిళలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రెడ్డి

నెక్కొండ, సెప్టెంబరు 27 : కుటుంబాల ఆర్థిక బాధ్యతలో మహిళలు భాగస్వాములు అయినప్పుడే కుటుంబ యజమానులపై కొంత భారం తగ్గుతుందని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, ఎంపీడీవో దయాకర్ అన్నారు. శుక్రవారం నెక్కొండలోని రైతు వేదికలో జరిగిన భారతి మండల సమాఖ్య 16వ వార్షిక మహాసభలో వారు మాట్లాడారు. ఇటీవలి కాలంలో మహిళలను చైతన్య పర్చడానికి ప్రభుత్వాలు అనేక రాకాల సంక్షేమ పథకాలను చేపడుతున్నాయని, ఆ పథకాలను వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటూ పలువురికి ఉపాధికల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రవీందర్, ఏకాంబ్రం, మాణిక్యం, వెంకట్, శారద, ఎంసీఏ శ్వేత, నాగరాణి, పద్మ, అనిత, సునీత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

వర్ధన్నపేట, సెప్టెంబర్ 27 : విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఏబీవీపీ జిల్లా నాయకుడు కుంట హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం వర్ధన్నపేటలో జరిగిన ఏబీవీపీ కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్‌తో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అనంతరం ఏబీవీపీ వర్ధన్నపేట శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్ధన్నపేట పట్టణ కార్యదర్శిగా జీవన్, కార్యవర్గ సభ్యులుగా బెల్లం కార్తీక్, నగర కార్యదర్శిగా గోరుకొంటి శివమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గీసుగొండ, సెప్టెంబరు 27 : క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహధారుఢ్యం, సమయస్ఫూర్తి విద్యార్థుల్లో పెంపొందుతాయని గీసుగొండ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం పట్టాభి అన్నారు. గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన అండర్ 14, 17 స్థాయి పాఠశాల గ్రామీణ క్రీడలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ధర్మారం పాఠశాల పీడీ వజ్రను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాక శ్రీనివాస్, రవిందర్, శ్రీధర్, టి. శ్రీనివాస్, హేమలత, రతన్‌సింగ్‌రాథోడ్, ముఖర్జీ, సరస్వతి, రాజన్నలు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుంది

చెన్నారావుపేట, సెప్టెంబరు 27 : క్రీడలతో స్నేహభావంతో పాటు సమైక్యత పెరుగుతుందని ఎస్సై రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జల్లి హైస్కూల్‌లో చెన్నారావుపేట, నెక్కొండ మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను శుక్రవారం ఎస్సై రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి క్రీడలు నిర్వహించడంతో విద్యార్థులతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సరళ, సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు తొగరు చెన్నారెడ్డి, పీఈడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల గణన వెంటనే చేపట్టాలి

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 27 : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే కుల గణనను చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు జీజుల సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సోల్తి సారయ్య, డాక్టర్ జగదీశ్వర్, పెండెం భాస్కర్, రఘుపతి, సాంబరాతి మల్లేశం పాల్గొన్నారు.

పోలీసులు బాధ్యతగా పనిచేయాలి

నల్లబెల్లి, సెప్టెంబరు 27 : విధి నిర్వహణలో పోలీసులు బాధ్యతగా పనిచేయాల ని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీసులు చట్టపరంగా ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. పోలీసులకు సలహాలు, సూచనలు చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ, ఎస్సై ప్రశాంత్ బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్'



మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 27 : ఎమ్మెల్యే కేఆర్. నాగరాజుపై ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఖబడ్దార్ అని మాల మహానాడు జిల్లా నాయకులు మన్నె బాబురావు, దావ రవి,దండ్రి శ్రీనివాస్, గొర్రె మహేష్ హెచ్చరించారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన మాల ఉద్యోగుల సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు ప్రసంగిస్తున్న సమయంలో నాకు మాలల ఓట్లు అధికంగా పడ్డాయని, మాదిగల ఓట్లు చీలిపోయాయని అన్నారన్నారు. కానీ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల నాయకులు ఎమ్మెల్యే వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇలా అనుకుంటే మాలలు చాలాసార్లు ఇలాంటివి ఖండించాల్సి ఉంటుందని ఎప్పుడు చేయలేదన్నారు. సమావేశంలో మాల మహానాడు ఉపాధ్యక్షురాలు ఒగ్గుల మాధవి, బెజ్జం పాపారావు, ఒగ్గుల కొమ్మాలు, ఏనమల్ల సాయిబాబా, బలిజ వెంకటయ్య, ఒగ్గుల రఘు, బందుగు చందర్, లింగాల రంజిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు వ్యాఖ్యలను వక్రీకరించి అసత్య ఆరోపణలు చేస్తూ రాజీనామా చేయాలని కోరడం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల అవివేకానికి నిదర్శనమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, నాయకులు మన్నె బాబురావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారిన ఎమ్మార్పీఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై, ఎమ్మెల్యే నాగరాజుపై నిరాధార ఆరోపణలు చేసి బీజేపీ నేతల వద్ద మెప్పు పొందాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో మల్లెపాక సమ్మయ్య అయిత ప్రవీణ్‌కుమార్, తుమ్మల రవీందర్, చెరిపల్లి బాబు, చంద్రమౌళి, చీటూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

మామిడి సీజన్‌లో మార్కెట్లో క్రయవిక్రయాలు జరపాలి

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబర్ 27: వచ్చే మామిడి సీజన్‌లో ఏనుమాము ల మార్కెట్లో క్రయవిక్రయాలకు అవకాశం కల్పించాలని పండ్ల మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెల్ది సాంబయ్య మార్కెట్ కార్యదర్శిని కోరారు. శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను పండ్ల వ్యాపారులు కలిశారు. ఈ సందర్భంగా వెల్ది సాంబయ్య మాట్లాడు తూ.. మరో మూడు నెలల్లో మామిడి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్కె ట్లో క్రయ విక్రయాలకు అవకాశం కల్పించాలని, కొత్తగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి దుకాణాలకు కేటాయించాలని కోరారు. మార్కెట్ కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ.. పండ్ల మార్కెట్లో వ్యాపా రులు చాలా మంది మార్కెట్ ఫీజు బకాయిలు పడి ఉన్నారని, వారిని వెంటనే ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పండ్ల మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి దొంగల చెన్నమల్లు యాదవ్ పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

దుగ్గొండి, సెప్టెంబరు 27 : తాటి చెట్టు పైనుంచి పడి గాయపడిన ప్రతి గీత కార్మికుడికి ప్రభుత్వం జాప్యం చేయకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్‌చేశారు. మండలంలోని వెంకటాపురంలో ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి గాయపడిన కక్కెర్ల రాజును శుక్రవారం సందర్శించి పరామర్శించారు. కార్యక్రమంలో పొగాకు కృష్ణమూర్తి, కక్కెర్ల సాంబయ్యగౌడ్, కర్ణాకర్‌గౌడ్, పొగాకు వెంకటేశ్వర్లు, బొమ్మగాని సదానందం, ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, సదయ్య, సమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రాల్లో నేడు రేబిస్ దినోత్సవం

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని 57 పశువైద్య కేంద్రాలలో ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వ హిస్తున్న జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేర కు పశువైద్య కేంద్రాల్లో రేబిస్ వ్యాధి కుక్కలకు సోకకుం డా ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. జిల్లాకు 18,700 డోసులను సరఫరా చేయడం జరిగిందని, 8,700 డోసులను మండలాలకు, 10వేల డోసులు కార్పొరేషన్ పరిధిలోని కుక్కలకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. పెంపుడు కుక్కలకు వాటి యజమాని సహాయం, వీధి కుక్కలకు లోకల్ బాడీస్ సహకారంతో టీకా ల కేంద్రముకు తీసుకెళ్లి ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తా రని వివరించారు. రేబిస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

భగత్‌సింగ్ జయంతి వేడుకలు



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపురం, సెప్టెంబరు 27 : మండలంలోని ధర్మరావుపేటలో భగత్ యువజన సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్‌చేసి భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భగత్ యువజన సంఘం అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.